
సాక్షి గుంటూరు

శనివారం । 12 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,514 క్యూసెక్కులు విడుదల చేశారు.



శ్రావణమాసం సారె

చేబ్రోలు: నిత్యానంద ఆశ్రమంలోని కన్యకాపరమేశ్వరి, శారదాదేవి అమ్మవార్లకు శుక్రవారం శ్రావణమాసం సారెను మహిళలు సమర్పించారు. సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు.



దుర్గమ్మ దర్శనం

విజయవాడ : దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

అమరుల త్యాగాలు స్మరించుకుందాం

గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): దేశ స్వాతంత్య్రం కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యతని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ చెప్పారు. 75 ఏళ్ల ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను గౌరవించాలని సూచించారు. తొలుత పోలీస్ పరేడ్ మైదానంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్‌మహేష్ (ఎస్‌ఈబీ), ఏఈఎస్ దుర్గప్రసాద్, డీఎస్పీలు సుభాష్ (ఎస్‌బీ), చంద్రశేఖర్ (ఏఆర్), సీఐ బి.నరసింహారావు, ఆర్‌ఐలు థామస్‌రెడ్డి, రాజారావు పాల్గొన్నారు.

మత్తు పదార్థ తయారీదారు అరెస్టు

గుంటూరు రూరల్: ఒక అపార్ట్‌మెంట్‌లో నిషేధిత మత్తు పదార్థాలను తయారు చేస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన వాసేపల్లి రామకృష్ణారెడ్డి, హైదరాబాద్‌లో నివాసం ఉండే అతని మేనల్లుడు శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరూ కలిసి లిక్విడ్ గంజాయిని మరగబెట్టి మెర్త్ అనే మత్తుపదార్థం తయారు చేసి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని తెలుసుకున్నారు. లిక్విడ్ గంజాయిని సేకరించి మెర్త్ తయారీకి మహాలక్ష్మి బార్ ఎదురు సందులో ప్రకాష్ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. అందులో గుట్టుచప్పుడు కాకుండా మెర్త్ తయారు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు రెక్కీ నిర్వహించి రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద కొద్ది మొత్తంలో నిషేధిత మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు అద్దంకి విద్యార్థులు



అద్దంకి: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పట్టణానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీపీ రత్నం చెప్పారు. ఈపోటీలు ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీలకు అద్దంకిలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన బీ శ్వేతారెడ్డి, ఎల్ హస్మిత, ఎస్ నాగూర్‌బీ, కే సెరాఅంజల్, ఏ లక్ష్మిప్రసన్న, కే అనూషా, ఎస్‌కే షబానా, ఎన్ అను, జీ రాజేశ్వరి, వీరు, బల్లికురవ కేజీబీవీ విద్యార్థులు జీ ఇజ్రాయేల్, డీపీపీ అంజిరెడ్డి ఎంపికైనట్లు చెప్పారు. స్థానిక గీతా మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి పి.రాంబాబు, చిన్ని మురళి, వెంకటకృష్ణారెడ్డి, ఎల్.అమరనాథ్, శ్యామ్‌ప్రసాద్ హాజరయ్యారు.

డీబీటీ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి



నరసరావుపేట: డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎండీ కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వివిధ సంక్షేమ అధికారులతో బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమ్మఒడి, చేయూత, చేదోడు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో తప్పకుండా ఈకేవైసీ చేయించాలన్నారు. డీబీటీ స్కీం వెల్ఫేర్ అసిస్టెంట్లు వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఈడీలు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, డీజేబుల్ ఈడీ పాల్గొన్నారు.

దేశమాతకు నెత్తుటి తిలకం

దేశమాత నుదిటిన తెనాలి నెత్తుటి తిలకం దిద్దింది. ఏడుగురి పోరాట యోధుల బలిదానంతో స్వేచ్ఛాగీతికకు ఊపిరిలూదింది. స్వాతంత్య్రోద్యమాన్ని తారస్థాయికి చేర్చింది. క్విట్ ఇండియా నినాదంతో గర్జించింది. అంతర్జాతీయ బోనులో బ్రిటిష్ మదగజాన్ని బంధించి దాని పీచమణిచిన మహోన్నత త్యాగఘట్టానికి వేదికై చరిత్రపుటల్లో నిలిచింది.



- ఉవ్వెత్తున ఎగసిన క్విట్ ఇండియా ఉద్యమం
- ఆందోళనలతో ప్రతిధ్వనించిన తెనాలి
- పోలీసు కాల్పుల్లో ఏడుగురి బలిదానం
- నేడు క్విట్‌ఇండియా అమరవీరుల దినోత్సవం

తెనాలి: క్విట్ ఇండియా.. ప్రతి భారతీయుడి నోట వినిపించిన రణన్నినాదం.. బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహోజ్వలిత పోరాటం..! చైతన్యానికి మారుపేరైన తెనాలిలో ఆనాడు ఉద్యమం తారాస్థాయికి చేరింది. పోలీసు కాల్పుల్లో ఏడుగురి పోరాటయోధుల బలిదానానికి దారితీసింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టిన మహోద్యమంగా మలుపుతిరిగింది.

గాంధీజీ పిలుపు మేరకు..

తెల్లదొరలను దేశం విడిచివెళ్లాలంటూ 1942లో గాంధీజీ ఇచ్చిన 'క్విట్‌ఇండియా' నినాదం మేరకు కాంగ్రెస్ వాదులు, విద్యార్థులు ఉద్యమంలో ఉవ్వెత్తున పాల్గొన్నారు. ముంబై సమావేశంలో పాల్గొన్న ఆనాటి జిల్లా నేతలు కల్లూరి చంద్రమౌళి, వెలువోలు సీతారామయ్య, పుతుంబాక శ్రీరాములు, అవుతు సుబ్బారెడ్డి, శరణు రామస్వామి తెనాలి వచ్చారు. అగ్రశ్రేణి ఉద్యమ నేతల అరెస్టుతో నాటి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (వెర్రెయ్యగారి మేడ)లో కార్యకర్తలు సమావేశమై, మరుసటిరోజు ఆగస్టు 12న పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. కల్లూరి చంద్రమౌళి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నన్నపనేని వెంకట్రావు, కార్యదర్శి రావి అమ్మయ్య నేతృత్వంలో తెనాలి తాలూకా హైస్కూలు, భారత్ ట్యుటోరియల్ కాలేజి విద్యార్థులు సహా వేలాదిమంది బంద్‌లో పాల్గొన్నారు.

రైల్వేస్టేషను సమీపంలో తెరిచి ఉంచిన హోటల్‌లోని ఫర్నిచరు, సామగ్రిని బయటపడేశారు. రైల్వేస్టేషనులో పండ్లదుకాణం, హోటల్‌నూ మూయించారు. అక్కడే స్పెన్సరు క్యాంటిన్‌లోకి వెళ్లి మద్యం సీసాలను ధ్వంసం చేశారు. నార్త్ క్యాబిన్ దగ్గర్లోని ఆయిల్ ట్యాంకరుకు నిప్పంటించారు. రెండు వ్యాగన్లలోని షాహి దక్కన్ సిగరెట్ బండిల్స్‌ను ప్లాట్‌ఫాంపై వేసి తగులబెట్టారు. రైల్వేస్టేషన్‌కు మంటలు వ్యాపించాయి. అప్పుడే చెన్నై నుంచి వచ్చిన ప్యాసింజరు రైలులోంచి ప్రయాణికులను దించేసి, నాలుగు బోగీల్లో కిరోసిన్ పోసి నిప్పంటించారు.



స్థూపాల ఆవిష్కరణకు ఏడు గుర్రాలు కట్టిన సూర్యరథంపై నాటి ఆంధ్ర, తమిళనాడు సీఎంలు నీలం సంజీవరెడ్డి, కామరాజునాడార్. సారథిగా ఆలపాటి వెంకట్రామయ్య (ఫైల్)

అడ్డుకున్న బ్రిటిష్ కలెక్టర్, ఎస్పీ



స్థూపాల ముందు తెలుగుతల్లి విగ్రహం

రైల్వేస్టేషను నుంచి కొత్తపేటలోని సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వెళ్తుండగా, ప్రస్తుత రణరంగ్ చౌక్ ప్రాంతంలో ప్రత్యేక బలగాలతో వచ్చిన బ్రిటిష్ కలెక్టర్, ఎస్పీలు, ఉద్యమకారులను నిలువరించారు. దీంతో ప్రజల ఆవేశం కట్టలు తెంచుకుంది. సమీపంలోని కట్టెల అడితీ నుంచి కట్టెలు పైకిలేచాయి. పోలీసులు కాల్పులకు తెగబడటంతో ఏడుగురు అమరులయ్యారు.

అంతర్జాతీయస్థాయిలో సంచలనం

ఈ పోరు అప్పటి బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన చర్చిల్, సింగపూర్‌లో ఉన్న నేతాజీ దృష్టికి వెళ్లింది. బెర్లిన్, టోక్యో రేడియోలు ప్రసారం చేశాయి. ఘటన తర్వాత తెనాలిలో పౌరజీవితం పోలీసుల దయాదాక్షిణ్యమైంది. నాయకులు, దేశభక్తులను అరెస్టుచేసి, కోర్టుల్లో శిక్షలు విధించారు. మొదటి ముద్దాయి రావి అమ్మయ్యను కడలూరు జైలుకు పంపారు. విద్యార్థుల కోసం తాలూకా హైస్కూలుకు వెళ్లిన పోలీసులను ప్రధానోపాధ్యాయుడు జొన్నలగడ్డ శివసుందరం అనుమతించలేదు. తెనాలి ప్రజలపై రూ.2 లక్షల సామూహిక జరిమానా విధించి, వసూలుకు నానా బాధలు పెట్టారు.

నాటి ఘట్టానికి గుర్తు రణరంగ్‌చౌక్

స్వాతంత్య్రం సిద్ధించాక పోలీసు కాల్పులు జరిగిన ప్రదేశానికి రణరంగచౌక్‌గా నామకరణం చేశారు. 1959లో మున్సిపల్ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య ఇక్కడ అమరవీరుల స్మృతి చిహ్నంగా ఏడు స్థూపాలను నిర్మించారు. స్థానిక శిల్పి చిన్నాల రంగారావుతో తెలుగుతల్లి విగ్రహాన్ని చేయించారు. అదే ఏడాది డిసెంబరు 20న అప్పటి ఏఐసీసీ అధ్యక్షుడు కామరాజు నాడార్ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, దామోదరం సంజీవయ్య, వెనిగళ్ల సత్యనారాయణ, కన్నెగంటి రెడ్డమ్మ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.



రణరంగచౌక్‌లో అమరవీరుల స్థూపాలు

నేడు అమరవీరుల స్మరణ

రణరంగ్ చౌక్‌లో ఏటా ఆగస్టు 12న మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీరసంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యవేక్షణలో జరగనున్న కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. అమర వీరులకు నివాళి అర్పించనున్నారు.

అతివల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- 4వ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ నగదు జమ
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



వైఎస్సార్ సున్నా వడ్డీ చెక్కును మహిళలకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు: అతివల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 4వ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని 34,228 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,68,729 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 52.84 కోట్లు నేరుగా బటన్ నొక్కి జమ చేశారని పేర్కొన్నారు. ఏటా క్రమం తప్పకుండా ఇస్తున్న సున్నా వడ్డీ మొత్తాలు స్వయం సహాయక గ్రూపులకు ఎంతో లబ్ధిచేకూరుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బ్యాంకర్లతో మాట్లాడి 13.5 శాతంగా ఉన్న వడ్డీని 7 నుంచి 8 శాతం వరకు తగ్గించారని వివరించారు. గ్రూపులు రూ.3 లక్షల రుణం తీసుకుంటే వడ్డీ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన కుటుంబంలో ఒకడిలా మారిపోయారన్నారు. కష్టమొస్తే సంక్షేమ పథకాలు అందిస్తూ ఆపన్న హస్తం అందిస్తున్నారన్నారు. కేవలం నవరత్న పథకాలే కాకుండా మొత్తం 34 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పురుషోత్తం వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, ఏపీ టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ వెంకటనారాయణ, స్వయం సహాయక సంఘాల జిల్లా అధ్యక్షురాలు శారమ్మ, అధికారులు పాల్గొన్నారు.

వడ్డీ భారం లేదు



జగనన్న మా గ్రూపు తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీలను క్రమం తప్పకుండా బ్యాంకులో జమ చేస్తున్నారు. దీంతో మేము బ్యాంకు నుంచి తీసుకున్న మొత్తాన్నే కడుతున్నాం. వడ్డీ చింతే లేకుండా ఈ ప్రభుత్వం చేసింది. ఉన్న దాంట్లో ఉపాధి పొందుతూ క్రమం తప్పకుండా బ్యాంకులకు చెల్లిస్తున్నాం.

– షేక్ జరీనా, లాం

అన్ని పథకాలు మాకు వస్తున్నాయి



కూలీ నాలీ చేసుకునే మాలాంటి వారికి కుటుంబ పెద్దలా వ్యవహరిస్తూ నేనున్నానని భరోసా ఇస్తున్న ముఖ్యమంత్రి నిండునూరేళ్లూ జీవించాలి. నాకు 4వ విడత వడ్డీ రాయితీతోపాటు ఒంటరి మహిళ ఫించన్ కూడా వస్తోంది. ఆరోగ్యశ్రీతో హాస్పిటల్ ఖర్చు లేదు. మందులు కూడా ఇస్తున్నారు. ధన్యవాదాలు.

–అథెహరున్, గుంటూరు

లాహిరి లాహిరి 'లాంచీలో'..

- కృష్ణానదిలో లాంచీ ప్రయాణం ప్రారంభం
- రాయపూడి ఫెర్రీకి కొత్తగా రెండు లాంచీలకు అనుమతి
- మూడున్నరేళ్ల సుదీర్ఘ విరామం తరువాత నదిలో రాకపోకలు



రాయపూడి వద్ద కృష్ణానదిలో లాంచీ ప్రయాణం

రాయపూడి(తాడికొండ): కృష్ణానదిలో మూడున్నరేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ప్రభుత్వం వసతులతో కూడిన లాంచీ ప్రయాణానికి అనుమతులు మంజూరు చేసింది. పాపికొండల యాత్రకు వెళ్లిన బోటు తిరగబడడంతో అప్పట్లో రాష్ట్రంలో పడవ ప్రయాణాలను ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా రాయపూడి రేవు మూతపడింది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు రెండు లాంచీల రాకపోకలకు అనుమతి ఇవ్వడంతో లైఫ్ జాకెట్లు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, ఇతర పూర్తి వసతులతో కూడిన ప్రయాణం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. రాయపూడి రేవు నుంచి కృష్ణా జిల్లాకు వెళ్ళేందుకు 50 కిలోమీటర్లు దూరం తగ్గుతుండటంతో ద్విచక్ర వాహనదారులూ లాంచీ ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తారు. టికెట్ ధరగా ఒకొక్కరికి రూ.50ను లాంచీల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.50 వసూలు చేస్తున్నారు.

రైల్వే నిర్మాణాలు చేపట్టాలి

కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ అయోధ్యరామిరెడ్డి వినతి



రైల్వే మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి

పాత గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను త్వరగా చేపట్టాలని రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని ఎంపీ కలిసి రాష్ట్రంలోని పలు ప్రతిపాదనల గురించి వివరించారు. గుంటూరు–సికింద్రాబాద్ రైలుకు 'అనవేమ ఎక్స్‌ప్రెస్' పేరు పెట్టాలని కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాలలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద కొన్ని ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని కోరారు. గుంటూరు బ్రాడీపేట్ ఫ్లై ఓవర్‌ను 6 లైన్ల వెడల్పుతో పునర్నిర్మించాలని విన్నవించారు. మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి పరిధిలో కొత్త ఆర్‌వోబీలను నిర్మించాలని కోరారు. పెదకాకానిలో ఆర్‌వోబీ నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. తెనాలి మండలం వైకుంఠపురం గ్రామంలో ఆర్‌వోబీని, చినరావూరు వద్ద రైల్వే గేటును పునరుద్ధరించాలని కోరారు.

• సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 864.70 అడుగుల వద్ద ఉంది.

ముగిసిన రోల్ బాల్ సౌత్‌జోన్ పోటీలు



గుంటూరు(క్రీడలు): రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న రోల్ బాల్ సౌత్‌జోన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. సంఘ కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 11 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 60 మంది చిన్నారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరిలో 20 మందిని ఈనెల 14, 15 తేదీల్లో కేరళలోని కొల్లంలో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్స్‌కు పంపిస్తామని వెల్లడించారు. అనంతరం చిన్నారులకు స్టేడియం చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, ప్రతాప్, హరిబాబు తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,400, గరిష్ఠ ధర రూ.2,800, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

క్లుప్తంగా

ఉద్యోగం పేరుతో మోసం

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో ఓ యువతిని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బ్రాడీపేట 6/13లోని ఓ లేడీస్ హాస్టల్‌లో నివసించే ఎ.త్రివేణి అనే యువతి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం కల్యాణీవాసు అనే మహిళ ఫోన్‌లో త్రివేణిని సంప్రదించింది. వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగం ఇచ్చి కొంత వర్క్ చేసిన తరువాత డబ్బులు పంపితే పెద్ద ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపింది. అది నమ్మిన త్రివేణి పలు విడతలుగా 4 లక్షలు చెల్లించింది. అనంతరం ఫోన్ నెంబర్ పనిచేయలేదు. ఆన్‌లైన్‌లోనూ ఎటువంటి సమాధానం రాలేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన త్రివేణి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యార్డుకు 26,410 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,882 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,410 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి 23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి 23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి 14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,634 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పీఎం శ్రీ పథకం కింద 21 పాఠశాలలు ఎంపిక

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకం
- ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సాహం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి గుంటూరు జిల్లాలో 21 పాఠశాలలు ఎంపికయ్యాయి. విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తిని పెంపొందింపజేసి ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు పీఎంశ్రీ ద్వారా పాఠశాలల్లో వివిధ రకాల వసతులను కల్పించనున్నారు. పీఎంశ్రీ కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ల్యాబొరేటరీలతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వృత్తి విద్యాకోర్సులను అందించనున్నారు. జాతీయ నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ఆధునిక విద్యకు కేంద్రాలుగా పాఠశాలలను తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా తొలి దశలో జిల్లాలో ఎంపిక చేసిన 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు కేంద్రం నిధులు విడుదల చేయనుంది.


పాఠశాలల్లో ప్రయోగాలు (ఫైల్)

ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 40 శాతం నిధులు జోడించాల్సి ఉంది.

పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు నూతన భవన నిర్మాణాలను చేపట్టడంతో పాటు టాయిలెట్లు, గ్రంథాలయం, సౌర విద్యుత్ వ్యవస్థ, పాఠశాలల ప్రాంగణాల్లోనే కాయగూరలు, ఆకుకూరల సాగు, కాలుష్యానికి తావు లేని విధంగా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మాణాలు ఉండాలనే నిబంధన విధించింది. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, డిజిటల్ లైబ్రరీ, క్రీడల్లో ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని రకాల క్రీడా సామగ్రిని అందించనుంది. కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడతారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పీఎంశ్రీ కింద దరఖాస్తు చేసుకున్న పాఠశాలల నిర్వహణలో విద్యాశాఖతో పాటు స్థానిక సంస్థల భాగస్వామ్యం ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. నిధుల వినియోగంపై పక్కాగా ఆడిట్‌తో పాటు మంజూరు చేసే నిధులను కాంపోనెంట్స్ వారీగా ఖర్చు చేయాల్సి ఉంది.

డాక్యుమెంటేషన్ జరుగుతోంది

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో కల్పించాల్సిన వసతులు, భౌతికపరమైన అంశాలపై డాక్యుమెంటేషన్ జరుగుతోంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులను ప్రారంభించేందుకు వీలుగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలలకు సంబంధించిన సమగ్ర వివరాలు, క్రీడా స్థలం, తరగతి గదులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాం.

–పి.శైలజ, డీఈవో, గుంటూరు

మనిషిని ఏమార్చి.. ఏటీఎం కార్డులు మార్చి..

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): అమాయకులను ఏమార్చి.. ఏటీఎంల వద్ద కార్డులు మార్చి నగదు కాజేసే నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్ (ఇన్‌చార్జ్) ఎం. బాలసుందరరావు, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషాలు వివరాలు మీడియాకు వెల్లడించారు. గతనెల 14న బాపట్ల జిల్లా చినగంజాంకు చెందిన రాయిని శివలక్ష్మమ్మ ఆసుపత్రి పని నిమిత్తం గుంటూరుకు వచ్చి తన మనవరాలి ఏటీఎం తీసుకుని విజయటాకీస్ సమీపంలోని కొటాక్ మహీంద్ర బ్యాంక్ ఏటీఎం వద్దకు వెళ్లింది. డబ్బులు తీయటం రాకపోవటంతో అక్కడే నిలబడి ఉన్న వ్యక్తి సాయం కావాలా? అంటూ.. ఆమెను కోరగా, డబ్బులు తీసి పెట్టాలని కోరింది.

ఏటీఎం లోపలికి వెళ్లి శివలక్ష్మమ్మ కార్డులో నుంచి రూ.10 వేలు డ్రా చేసి ఇచ్చిన ఆగంతకుడు ఆమెకు నకిలీ కార్డు ఇచ్చాడు. అదే విధంగా గత నెల 12వ తేదీన ఓల్డ్‌క్లబ్ రోడ్డులో ఆసుపత్రికి వచ్చిన ఒక మహిళను మోసం చేసి ఏటీఎం కార్డు ఏమార్చి అందులోని రూ.29 వేలు దొంగిలించాడు. గత నెల 14వ తేదీనే ఆర్ఎస్ బ్రదర్స్ పక్కన ఉన్న పంజాబ్ నేషనల్ ఏటీఎంలోనూ ఇదే విధంగా ఒక వ్యక్తిని మోసం చేసి 8 వేల నగదు అపహరించాడు. దీనిపై వరుస ఫిర్యాదులు అందటంతో దృష్టి సారించిన పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ఆధారంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన జక్కా సోమరాజును నిందితుడిగా గుర్తించారు. శుక్రవారం ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఉన్న సోమరాజు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. కొత్తపేట ఎస్ఐ ఎస్. శ్రీనివాసరావు సిబ్బంది చాకచక్యంగా పట్టుకుని తమదైన శైలిలో విచారించటంతో నేరాలను అంగీకరించాడు. నిందితుడిపై గతంలో ఇటువంటి కేసులు నాలుగు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఎస్ శ్రీనివాసరావు, ఏఎస్ఐ ఎం.ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ నక్కా రవి, ఎం.దాసు, కిషోర్‌లను జిల్లా ఎస్పీ కె. ఆరీఫ్ హాఫీజ్ అభినందించారు.


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాల సుందరరావు, ఎస్‌హెచ్‌వో అన్వర్‌బాషా

ప్రాణాధార వర్క్‌షాపు సందర్శన

బాపట్ల: చెరువు జమ్ములపాలెంలోని ప్రాణాధార సెంట్రల్ వర్క్‌షాప్‌ను అఖిల భారత వరి పరిశోధన సంస్థ(ఐఐఆర్ఆర్) శాస్త్రజ్ఞులు డాక్టర్ మహేంద్ర కుమార్, ఎంబీబీ ప్రసాద్, ఏవీఎస్ ఆర్.స్వామి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ ప్రతినిధి హేమంత్ మాట్లాడుతూ ప్రాణాధార సంస్థ పొడి నేలలో 30 సెంటీమీటర్లు ఎడం సాళ్లతో గొర్రుతో వెద పెట్టే విధానం భారతదేశంలోని ప్రాణాధార ప్రప్రథమంగా చేపట్టారని తెలిపారు. వరి పైరులో సన్న టైర్లు బిగించిన కుబోటు చిన్న ట్రాక్టర్‌తో బురద నెలలో వరి విత్తనం విత్తు విధానం, పొడి నేలలో, బురద నేలలో కలుపుతీయుట, ఎరువులు చల్లటం, మురుగు కాలువలు వేయుట, మందుల పిచికారి చేయడం, వరి సాగు సులువుగా, సుస్థిరంగా, లాభసాటిగా చేయుటకు రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ రామాడ్, డాక్టర్ అనిల్ కుమార్, కుర్ర పుండరీకాక్షుడు, నూతలపాటి బాబు, కుర్ర సాంబశివరావు, పువ్వాడ బసంత్ కుమార్ పాల్గొన్నారు.

త్వరలో భారత్ బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ యాత్ర

భారత్ బ్లాక్ చైన్ యాత్ర కన్వీనర్ ఓరుగంటి అరవింద్

తాడికొండ: త్వరలో నిర్వహించే బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ యాత్రకు ఆతిథ్యం ఇస్తున్న మొట్టమొదటి విశ్వవిద్యాలయం వీఐటీ-ఏపీ అని భారత్ బ్లాక్ చైన్ యాత్ర కన్వీనర్, వైస్ ప్రెసిడెంట్ ఐడీఎస్ ఓరుగంటి అరవింద్ అన్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా ఐనవోలు వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో ఐడీఎస్ ద్వారా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ, వ్యాపార నెట్‌వర్క్‌లో పారదర్శక సమాచారం పంచుకోవడానికి వీలు కల్పించే అధునాతన భారత్ బ్లాక్ చైన్ సెంటర్ యాత్రను ఏఐసీటీఈ, విద్యామంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెబ్-3 బ్లాక్ చైన్‌కు సంబంధించిన భారతదేశపు మొట్టమొదటి సాంకేతిక యాత్ర భారత్ బ్లాక్ చైన్ యాత్ర అన్నారు.



సమావేశంలో పాల్గొన్న అతిథులు, ప్రతినిధులు

వీఐటీ ఏపీ వీసీ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ పరిశోధనలో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఎప్పుడూ ముందుంటుందని, త్వరలో క్యాంపస్‌లో ఐడీఎస్-వీఐటీ ఏపీ బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పూర్తిగా ఐడీఎస్ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐడీఎస్ సీఈవో సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ప్రభా సెల్వరాజ్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సునీల్ యడ్లవల్లి పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి ఎనలేని కృషి


మాట్లాడుతున్న అడపా శేషు. పక్కన మాణిక్యవరప్రసాద్, మేయర్ మనోహర్‌నాయుడు

- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కాపుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులో కాపు సోదరుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం నుంచి అన్ని రాజకీయ పార్టీలు కూడా కాపులపై కుట్ర చేస్తున్నాయన్నారు.

కానీ నేడు అలాంటి పరిస్థితులను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చరిత్ర తిరగరాసి కాపులకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబుకి ఊడిగం చేస్తూ చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాపు నేస్తం ద్వారా 2 కోట్ల రూపాయలు అక్క, చెల్లెమ్మలకు ఇవ్వడం జరిగిందన్నారు. పవన్‌కు మాయమాటలు చెప్పి చంద్రబాబు వాడుకుంటున్నాడనీ, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వారాహి, జనసేన కార్యాలయంతోపాటు పవన్ కల్యాణ్ మాట్లాడే మాటలు కూడా అతనివి కాదన్నారు.

త్వరలోనే అన్ని జిల్లాల్లోనూ కాపులతో సమావేశం ఏర్పాటు చేసి కాపులను ఏకతాటిపైకి తెచ్చి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి గతంలో న్యాయం చేసిన ఘనత రాజశేఖర్‌రెడ్డిది అయితే నేడు ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వాన్ని బలపరుస్తూ రానున్న ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం అంతా కూడా వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేసే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

- క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు..
- అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి

నరసరావుపేటఈస్ట్: క్రమశిక్షణ ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి తెలిపారు. జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి మధుస్వామి మాట్లాడుతూ ర్యాగింగ్ అనాగరిక చర్యగా పేర్కొన్నారు. సహచర విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. చదువుపై శ్రద్ధ ఉన్న విద్యార్థి ర్యాగింగ్‌కు దూరంగా ఉంటాడనీ, చదువు పట్ల నిర్లక్ష్యం వహించే విద్యార్థి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి చట్టం చేతికి చిక్కుతాడని తెలిపారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుస్వామి

విద్యార్థులు తల్లిదండ్రులకు, కళాశాలకు గౌరవం తీసుకవచ్చేలా జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన 2016 నుంచి ఇప్పటి వరకు ఒక్క ర్యాగింగ్ సంఘటన కూడా నమోదు కాలేదని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతారని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.పి.రాజు, మానసిక వైద్యులు డాక్టర్ సతీష్, కె.ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

పర్చూరు(చినగంజాం): తల్లిని చంపిన కేసులో కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను శుక్రవారం మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్, ఎస్ఐ ఎన్‌సీ ప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పర్చూరు మండలం కొత్తపాలేనికి చెందిన మద్దిన పేరమ్మ ఈనెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉండగా ఆమె చిన్న కుమారుడు మద్దిన అంజయ్య వచ్చి ఆమె పేరు మీద ఉన్న రెండెకరాల పొలాన్ని అతడి పేరు మీద రాయమని గొడవపడ్డాడు. రాయకపోవడంతో పాటు ఆమెకు ఇవ్వాల్సిన రూ.4 లక్షల డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఆమెను చంపాలనే ఉద్దేశంతో గొడవ పెట్టుకున్నాడు. అనంతరం కత్తితో గాయపరిచాడు. ఈక్రమంలో ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి అంజయ్య పారిపోయాడు. రక్తగాయాలతో ఉన్న పేరమ్మను స్థానికులు చీరాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆగస్టు 8న మృతి చెందింది. హత్యాయత్నం కేసును హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. శుక్రవారం పర్చూరు వై జంక్షన్ వద్ద అంజయ్యను అరెస్టు చేసి, పర్చూరు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. నిందుతుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

వ్యక్తిపై పోక్సో కేసు

పెదకాకాని: బాలికను మాయ మాటలు చెప్పి మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన తోకల ప్రసాద్ ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలికను వేధిస్తున్నాడు. అయితే మూడు రోజుల కిందట బాలిక అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం మైనర్ బాలికను తీసుకువచ్చి వివరాలు సేకరించగా చివరకు నిందితుడు వేధింపులకు గురిచేసినట్లు వెల్లడైంది. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు.

యువకుడిపై ..

పిట్టలవానిపాలెం: యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. చందోలు ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. మండలంలోని భవనంవారిపాలెం శివారు కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాలిక బంధువుల ఇంటికి రాగా అదే గ్రామానికి చెందిన యువకుడు ఈనెల 10వ తేదీ రాత్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అతడిపై గతంలోనూ ఓ పోక్సో కేసు నమోదైంది.

పిడుగుపాటుతో మహిళ మృతి

బల్లికురవ: పొలంలో పిడుగుపడి మహిళ చనిపోయిన ఘటన శుక్రవారం సాయంత్రం కొమ్మినేనివారిపాలెంలో చోటు చేసుకుంది. మన్యం చిన్నమ్మాయి(54) గ్రామం నుంచి కొప్పరపాడు వెళ్లే దారిలో తనకున్న రెండెకరాల పొలంలో బీర వేసుకుని జీవనం సాగిస్తోంది. వర్షం, పిడుగుపాటుకు బీరకాయలు కోస్తుండగా చనిపోయింది. భర్త నాగేశ్వరరావు పదేళ్ల క్రితం చనిపోయాడు.

లైఫ్@360

అమ్మో... అలర్జీ!

డోంట్ వర్రీ! నివారించండి ఇలా!



మనం తీసుకునే ఆహారం వల్ల... పీల్చే గాలి వల్ల లేదా వాడే మందుల వల్ల మన రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించి అలర్జీకి దారి తీస్తుంది. అలర్జీపై అలసత్వం కూడదని, కొన్ని అలర్జీలు ప్రాణాంతకం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనం కామన్‌గా ఎదుర్కొనే రకరకాల అలర్జీలు, కారణాలు, నివారణలపై అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.

గుర్తించేదిలా...

ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించి ఆ తరువాత మీ అలర్జీ కారకాలను గుర్తించడానికి చర్మ పరీక్షలు, ప్యాచ్ లేదా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నివేదికల ఆధారంగా మీరు ఏరకమైన అలర్జీలతో బాధపడుతున్నారో నిర్ధారించుకొని తగిన చికిత్సను సిఫార్సు చేస్తారు. అలర్జీలకు సరైన చికిత్సను నిర్ధారణ పరీక్షల ఆధారంగానే కాకుండా బాధితుడి మెడికల్ హిస్టరీ, లక్షణాల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అందిస్తారు. ఈ రుగ్మతకు శాశ్వత పరిష్కారం లేదు. దీన్ని ఏదో ఒక చికిత్సా విధానం ద్వారా అదుపులో మాత్రమే ఉంచుకోవచ్చు.

ఏం చేయాలి?

శరీరంలో అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే అలర్జీ స్పెషలిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం. డాక్టర్‌తో మీ ఫ్యామిలీ హిస్టరీ, జీవనశైలి, వాడుతున్న మందులు తదితర వివరాలను తెలియజేస్తే, దానికి తగిన నిర్ధారణ పరీక్షలను సూచిస్తారు. ముందుగా ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష,

ఆహారం.. అలర్జీ!

మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు ఫుడ్ అలర్జీలకు దారితీస్తాయి. సాధారణంగా అందరూ తీసుకునే గుడ్లు, పాలు, వేరుశెనగ, చేపలు, రొయ్యలు, పీతలు, సోయా, కొన్ని రకాల నట్స్ (అక్రోట్స్, బాదం, బ్రెజిల్ నట్స్), గోధుమ వంటి ఆహార పదార్థాలు కొందరి శరీర తత్వానికి సరిపడవు. వీరు వీటిని తీసుకోవడం వల్ల ఆహారానికి సంబంధించిన అలర్జీలు వస్తాయి. శరీరానికి ఈ పదార్థాలు సరిపడకపోతే దురద, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా కడుపు తిమ్మిర్లు, శ్వాస తీసుకోలేకపోవటం, గురక, దగ్గు, గొంతునొప్పి, పల్స్ పడిపోవడం, చర్మం నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఫుడ్ అలర్జీల నిర్ధారణకు చర్మ పరీక్షతో పాటు రక్త పరీక్షలు (ఐజీఈ యాంటీబాడీస్) కూడా చేయాల్సి ఉంటుంది.



కొంతమందిలో తేనెటీగలు, కందిరీగలు (ఇన్సెక్ట్ అలర్జీ), రబ్బరుతో తయారయ్యే వస్తువులు (బెలూన్, చేతి తొడుగులు, కాండమ్స్), కొన్ని రకాల మందులు(డ్రగ్ అలర్జీ), ఫంగస్ (మోల్డ్ అలర్జీ) లాంటివి కూడా కనిపిస్తుంటాయి.

డస్ట్ అలర్జీ

సాధారణంగా డస్ట్ అలర్జీ అనేది దుమ్ము, ధూళి వల్ల, వాటిలోని సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుంది. వీటిని డస్ట్ మైట్స్ అంటారు. ఈ డస్ట్ మైట్స్ మనుషుల నుంచి రాలిన చర్మ మృతకణాలను తింటూ ఇంట్లో దుమ్ము, ధూళికి కారణమవుతాయి. ఇవి శ్వాస తీసుకునే క్రమంలో శరీరంలోకి ప్రవేశించి శ్వాసనాళాల వాపునకు కారణమవుతాయి. దీనివల్ల తుమ్ములు, ముక్కు కారడం, కంటిలో దురద, కళ్ళలో నుంచి జిగటతో కూడిన నీరు, ఒళ్లంతా దురద, ముక్కు దిబ్బడ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన ఇళ్లలో ఉండే తేమ పరిస్థితులు ఈ డస్ట్ మైట్స్‌కు ఆవాసాలు. కాబట్టి ఇళ్లలో ఉండే దుప్పట్లు, దిండు కవర్లు, టవల్‌లు, తివాచీలు, ఇతర సామాన్లను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. డస్ట్ అలర్జీ కారకాలను గుర్తించడానికి స్కిన్ ప్రిక్ టెస్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. డస్ట్ అలర్జీతో బాధపడేవారు 80 శాతం మంది ఆస్తమా రోగులుగా మారుతున్నారు.



కంటి అలర్జీ



సాధారణంగా కంటి అలర్జీలు పుప్పొడి, డస్ట్‌మైట్స్, పెంపుడు జంతువుల చర్మ కణాలు వంటి వాటి వల్ల సంభవిస్తాయి. వీటి వల్ల కళ్లలో దురద, వాపు, మంట, జిగట నీరు కారడం, ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ రకమైన అలర్జీలు అంటువ్యాధులు కావు. కంటి అలర్జీలకు ప్రత్యేకమైన నిర్ధారణ పరీక్షలు ఏవీ ఉండవు. పైన పేర్కొన్న కారకాల్లో ఏవి అలర్జీకి కారణం అవుతున్నాయో పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే నివారణ.

స్కిన్ అలర్జీ

స్కిన్ అలర్జీ అంటే కేవలం చర్మ సంబంధిత అలర్జీ అనే అపోహ చాలామందిలో ఉంటుంది. స్కిన్ అలర్జీతో బాధపడే వారిలో విపరీతమైన దురద, చర్మంపై దద్దుర్లు, పొడి చర్మం, మంట, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, మందులు, అంటువ్యాధులు వంటి పలు కారణాల చేత ఇవి సంభవిస్తాయి. పెంపుడు జంతువులు, రసాయనాలు, సబ్బులు, కొత్తబట్టలు, స్కిన్ లేదా ఫేస్ క్రీమ్‌లు వంటివి చర్మ అలర్జీలకు ప్రధాన కారకాలు. చాలా మందిలో ఈ అలర్జీల కారకాలను పరీక్షల ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే సాధారణ రక్త పరీక్ష (తెల్ల రక్త కణాల పరీక్ష) ద్వారా బాధితుడి లక్షణాలను కొద్దిమేరకు గుర్తించే ప్రయత్నం చేయవచ్చు. మన చర్మం దేనికి ప్రతిస్పందిస్తుందో జాగ్రత్తగా పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే దీనికి నివారణ.



హెల్త్ టిప్స్

చలవ చేసే మిరియాలు



మిరియాలు మంచి ఘాటు వాసనను కలిగి ఉంటాయి. ఈ కారణంగానే వీటిని మసాజ్ ఆయిల్ తయారీలో ఒక వనరుగా ఉపయోగిస్తారు. ఈ ఆయిల్‌తో మర్దనా చేసుకోవడం లేదా కొన్ని చుక్కలు నీటిలో కలుపుకొని స్నానం చేస్తే కండరాల నొప్పులు, ఒళ్లు నొప్పులు, గాయాలు తగ్గుతాయి.

గ్లాసు మంచినీరు, ఐదు లేక ఆరు మిరియాలు, ఒక ముక్క తెల్ల ఉల్లిపాయ, చితక్కొట్టిన అల్లం ముక్క ఒకటి, చిన్న బెల్లం ముక్క ఇవన్నీ వేసి నీరు సగం అయ్యేంత వరకు కాచండి. వేడిగా ఉండగానే తాగండి. దీనిని సేవించడం వల్ల దగ్గు, జలుబు, గొంతు నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

భరించరానంత తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడు సార్లు తినాలి.

ఆరోగ్యానికి రక్ష డ్రాగన్ ఫ్రూట్

పండ్లలో డ్రాగన్ ఫ్రూట్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే ఇవి చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందువల్ల వీటిని చిన్న పిల్లల నుంచి పెద్దవారి దాకా ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. వీటిని తినడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే మూలకాలు అన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి.



ప్రస్తుతం చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో అధిక పరిమాణంలో అనేక విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. కాబట్టి జుట్టు సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది...

డ్రాగన్ ఫ్రూట్‌లో అధికమోతాదులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల వీటిని తీసుకునేవారికి రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, ఫ్లూ, జలుబు వంటి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం లభిస్తుంది. అంటు వ్యాధులు రాకుండా శరీరాన్ని కూడా కాపాడుతుంది.



జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది...

డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే ఫైబర్ పరిమాణాలు తీవ్ర జీర్ణక్రియ సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా మలబద్ధకం, పొట్ట నొప్పులతో బాధపడేవారు ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది.

గర్భధారణ సమయంలో...

గర్భధారణ సమయంలో మహిళలు తరచు ఏదో ఒక విధమైన అనారోగ్య సమస్యలకు గురవుతారు. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి ప్రతి రోజు డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా అధికంగా పరిమాణంలో లభిస్తుంది. దీంతో ఈ విటమిన్ సి లోపం నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

వాపు నుంచి ఉపశమనం...

చాలా మందికి శరీరంలోని కొన్ని భాగాలలో వాపు, శరీరమంతటా మంటలు వస్తుంటాయి. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు వైద్యుని సంప్రదించేముందు డ్రాగన్ ఫ్రూట్ తీసుకుని చూడాలి. అప్పటికీ తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను కలవాలి. ఎందుకంటే ఇందులో ఉండే సమ్మేళనాలతో ఆయా సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.

కొలెస్ట్రాల్‌ను అదుపు చేస్తుంది...

తరచు కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడేవారు గుండె జబ్బుల బారిన పడే అవకాశాలున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి డ్రాగన్ ఫ్రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

మీకు తెలుసా?

కంటికి మరీ దగ్గరగా పెట్టుకుంటే...



కంటి సామర్థ్యం, పనితీరు వంటి అంశాలు మహిళలకైనా, పురుషులకైనా సాధారణంగా ఒకేలా ఉంటాయి. ఒకవేళ కంటికి ఏవైనా సమస్యలు వస్తే అవి కూడా ఒకేలా రావాలి. కానీ... కంటికి దగ్గరగా పెట్టుకుని పుస్తకాల్ని చదివేవారిలో పురుషులతో పోలిస్తే మహిళల్లో సమస్యలు కాస్తంత ఎక్కువని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన అధ్యయనవేత్తలు గుర్తించారు. ఇందుకు కారణాన్ని సైతం అధ్యయనవేత్తలు శాస్త్రీయంగా విశ్లేషించారు.

అవేమిటంటే... పురుషుల చేతుల నిడివితో పోలిస్తే మహిళల చేతులు నిడివి కాస్తంత తక్కువ. ఫలితంగా చదివే సమయంలో పురుషులతో పోలిస్తే మహిళల కళ్లకు పుస్తకం ఒకింత దగ్గరగా ఉంటుంది. దాంతో ప్రెస్బయోపియా అనే కండిషన్ మహిళలకు వేగంగా వస్తుంది. అంటే దగ్గరి చూపు తగ్గడం అన్న సమస్య చాలా త్వరగా రావచ్చు. మహిళలు దీర్ఘకాలం పాటు ఇలా పుస్తకాలను చాలా దగ్గరగా చదువుతుండటం మూలాన బైఫోకల్ లెన్స్‌ను లేదా రీడింగ్ గ్లాసెస్‌ను చాలా త్వరితంగా ఉపయోగించాల్సి వస్తోందని పరిశోధనలు తెలుపుతున్నాయి. అయితే ప్రెస్బయోపియా అన్న సమస్యకు అనేక కారణాలు ఉంటాయని, ఒక్కొక్కరి వ్యక్తిగత అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ సమస్యకు కరెక్షన్స్ సూచించాల్సి ఉంటుందని కూడా పరిశోధకులు పేర్కొన్నారు.

సినిమా

రీల్స్

వింటేజ్ కింగ్?




● ప్రభాస్

ఇంతకీ ఆ టైటిల్‌ని ఫిక్స్ చేశారా? ఈ టైటిల్ అనుకుంటున్నారా అంటూ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం గురించి చర్చ జరుగుతోంది. ఈ చిత్రం టైటిల్‌ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే 'రాజా డీలక్స్' అని ఫిక్స్ చేశారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా 'వింటేజ్ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారనే వార్త వెలుగులోకి వచ్చింది. మరి.. వార్తల్లో ఉన్నట్లు 'రాజా డీలక్స్'ని ఫిక్స్ చేశారా? లేక 'వింటేజ్ కింగ్' అనుకుంటున్నారా? అనేది తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

డబ్బింగ్ ఆరంభం

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న విడుదల కానున్న సంగతి తెలిసిందే. విజయ్ కిరగందూర్ ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ వర్క్‌ను ఆరంభించారు. మరోవైపు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'కల్కి 2898 ఏడీ' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే.

శ్రీకాంత్ అడ్డాల డైరెక్షన్‌లో?



● అఖిల్

'ఏజెంట్' తర్వాత అఖిల్ కొత్త సినిమా గురించిన అధికారిక ప్రకటన ఇంకా వెల్లడి కాలేదు. అయితే అనిల్ అనే ఓ కొత్త దర్శకుడితో అఖిల్ సినిమా చేయనున్నారని, ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని ప్రచారం జరిగింది. తాజాగా దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలతో అఖిల్ ఓ సినిమా చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. శ్రీకాంత్ ఓ కథను రెడీ చేసి, అఖిల్‌కు వినిపించారట. ఈ స్క్రిప్ట్ అఖిల్‌కి నచ్చిందని సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే అఖిల్ – శ్రీకాంత్ అడ్డాల కాంబినేషన్‌లోని సినిమా ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కించిన 'పెద కాపు 1' ఈ నెలలోనే విడుదల కానుంది. ఒకవేళ అఖిల్‌తో సినిమా కన్ఫార్మ్ అయితే.. 'పెద కాపు 1' విడుదల తర్వాత ప్రకటన వస్తుందేమో?

పోలీస్ స్టేషన్‌లో...

హీరోయిన్ కేథరిన్ ట్రెసా పోలీస్ స్టేషన్‌లో ఉన్నారు. ఆమె పోలీసాఫీసర్ కాదు.. ఖైదీ కూడా కాదు. మరి.. పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్లారంటే.. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా. కేథరిన్ హీరోయిన్‌గా 'జార్జిరెడ్డి, వంగవీటి' చిత్రాల ఫేమ్ సందీప్ మాధవ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో సందీప్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు. కేథరిన్ క్యారెక్టర్ ఏంటనేది తెలియాల్సి ఉంది. అయితే ఎవరూ ఊహించని రీతిలో ఆమె పాత్రను డిజైన్ చేశారట చిత్రదర్శకుడు అశోక్ తేజ. ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన పోలీస్ స్టేషన్ సెట్‌లో సందీప్, కేథరిన్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్‌లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. ''స్క్రీన్‌ప్లే బేస్డ్ చిత్రమిది. సరికొత్త యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం కొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమాలో ఎవరూ ఊహించని మలుపులు ఉంటాయి. ప్రతి సీన్ ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు దర్శకుడు.



● కేథరిన్

నీకిదే స్వాగతాంజలి



● కంగనా రనౌత్

'లాస్య విలసిత.. నవ నాట్యదేవత.. నటనాంకిత అభినయ వ్రత చారుధీర చరిత స్వాగతాంజలి.. స్వాగతాంజలి' అంటూ సాగే పాట 'చంద్రముఖి 2' చిత్రంలోనిది. రాఘవా లారెన్స్, లక్ష్మీ మీనన్, కంగనా రనౌత్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. పి. వాసు దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబరు 15న విడుదల కానుంది. ఈ చిత్రంలో చంద్రముఖి పాత్రధారి కంగనా రనౌత్‌పై చిత్రీకరించిన 'ఓ చంద్రముఖి నీకిదే స్వాగతాంజలి' పాట తెలుగు, తమిళ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. యం.యం. కీరవాణి స్వరకల్పనలో చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించిన ఈ పాటను శ్రీనిధి తిరుమల పాడారు. ఇక రజనీకాంత్ హీరోగా జ్యోతిక, ప్రభు, నయనతార లీడ్ రోల్స్‌లో పి. వాసు దర్శకత్వంలో రూపొందిన 'చంద్రముఖి' చిత్రం 2005లో విడుదలై ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' తెరకెక్కింది.

అందుకే స్పందించా!



● విశాల్

''సాధారణంగా నేను వదంతులకు, అబద్ధపు వార్తలకు స్పందించను. ఎందుకంటే అవి పూర్తిగా అనవసరమైన విషయాలు. కానీ ఇప్పుడు స్పందించడానికి కారణం ఈ వార్తతో ఒక అమ్మాయి జీవితం ముడి పడి ఉండడమే'' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు విశాల్. హీరోయిన్ లక్ష్మీ మీనన్, విశాల్ పెళ్లి చేసుకోనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్తను ఉద్దేశించే విశాల్ పై విధంగా పేర్కొన్నారు. ''లక్ష్మీ మీనన్‌తో నా పెళ్లనేది నిజం కాదు. మా ఇద్దరి పెళ్లంటూ వస్తున్న వార్తను ఖండిస్తున్నాను. ఒక అమ్మాయి వ్యక్తిగత జీవితానికి నష్టం కలిగించడం సరి కాదు. భవిష్యత్తులో నేను ఎవర్ని, ఏ తేదీ, ఏ టైమ్‌లో పెళ్లి చేసుకుంటాననేది తెలుసుకోవడం అందరికీ పెద్ద కష్టమేం కాదు. అయినా సమయం వచ్చినప్పుడు నా పెళ్లి గురించి నేనే చెబుతాను'' అని కూడా విశాల్ అన్నారు.

చందమామ కథలోన..



● రక్షిత్, రాఘవేంద్ర రావు

రక్షిత్ అట్లూరి, సంకీర్తన విపిన్ జంటగా వెంకట సత్య దర్శకత్వంలో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'చందమామ కథలోన..' పాట లిరికల్ వీడియోను దర్శకుడు కె. రాఘవేంద్ర రావు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చందమామ కథలోన.. అందమైన పిల్లేనా.. కళ్ల ముందు వాలిందా.. తుళ్లి తుళ్లి పడ్డాన..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా హరి చరణ్, గీతా మాధురి పాడారు. శరవణ వాసుదేవన్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి.

వినోదం..సందేశం



● ఇషా, మల్లిక్, సుమన్

మల్లిక్ బాబు, వినయ్, ఇషా, ప్రియాన్స్ హీరో హీరోయన్లుగా, సుమన్ కీలక పాత్రలో నటిస్తున్న సినిమా 'దుమారం'. జీఎల్బీ శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. సుమన్ మాట్లాడుతూ– ''నాయీ బ్రాహ్మణుల వృత్తి, వారు జీవితంలో పడుతున్న ఇబ్బందులను కమర్షియల్ ఫార్మాట్‌లో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఇందులో బార్బర్‌గా చేస్తున్నా. వినోదం, సందేశం అన్నీ ఉన్న చిత్రం అన్నారు. ''హీరో తండ్రి పాత్రను సుమన్ చేస్తున్నారు'' అన్నారు జీఎల్బీ శ్రీనివాస్. ''తొలి చిత్రంలోనే మాస్ క్యారెక్టర్ దొరకడం హ్యాపీ'' అన్నారు మల్లిక్. ''ఈ సినిమా కో ప్రొడ్యూసర్‌గా చేస్తూనే, విలన్ కొడుకు పాత్ర చేస్తున్నా'' అన్నారు పాండు గౌడ్.

మూడు దశలు.. పెద్ద సవాల్



● శ్రీ సింహా కోడూరి

''ఉస్తాద్ కథ మూడు దశల్లో ఉంటుంది. నా పాత్రలో మూడు వేరియేషన్స్ ఉంటాయి. ఇది పెద్ద సవాల్‌గా అనిపించింది. ముఖ్యంగా కాలేజీ ఎపిసోడ్స్ కోసం బరువు తగ్గాను'' అన్నారు శ్రీ సింహా కోడూరి. శ్రీ సింహా కోడూరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా నటించిన చిత్రం 'ఉస్తాద్'. ఫణిదీప్ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, దువ్వూరు హిమాంక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీ సింహా కోడూరి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సూర్య అనే యువకుడి పాత్ర చేశాను. సూర్య కాలేజీకి ముందు ఏం చేశాడు? కాలేజీ లైఫ్ ఎలా సాగింది? పైలట్ ఎలా అయ్యాడు? అనేది ఈ చిత్రకథ'' అన్నారు.

ఫన్... థ్రిల్



● శ్రీ కమల్, శివాని

'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు' వంటి పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిలేబి'. అంజు అశ్రాని సమర్పణలో పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ నిర్మించారు. విజయభాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ కథానాయికగా, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. మణిశర్మ సంగీతం ఓ ప్రధాన ఆకర్షణ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



● సుమన్, గరీమా

సుమన్, గరీమా చౌహాన్ జంటగా సతీష్ పరమవేద దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. రాచాల యుగంధర్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ పోచంపల్లిలో మొదలైంది. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమా చివరి షెడ్యూల్‌లో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఫైట్ మాస్టర్ డ్రాగన్ ప్రకాష్ నేతృత్వంలో 100 మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమాను దసరాకి రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

దీపావళికి...



● శ్రీరామ్

శ్రీరామ్, అయ్యప్ప పి. శర్మ, అజయ్ కీలక పాత్రల్లో బేబీ డమరి సమర్పణలో రూపొందిన చిత్రం 'ఎర్ర చీర'. సుమన్ బాబు, ఎన్వీవీ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం దీపావళికి నవంబర్ 9న రిలీజ్ కానుంది. సుమన్ బాబు దర్శకత్వం వహించారు. ''అమ్మ సెంటిమెంట్, హారర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. 36 నిమిషాల గ్రాఫిక్స్, లక్షలాది మంది అఘోరాలతో తీసిన క్లైమాక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి'' అన్నారు ఎన్వీవీ సుబ్బారెడ్డి, సుమన్ బాబు.